ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 20 మార్చి 2024



మంగళవారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 31.0°C | కనిష్టం : 22.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.33 గం..

సహర్ : గురువారం ఉ : 4.58 గం..



తొర్రూరు మండలం చింతలపల్లిలో ఎండలో పనులు చేస్తున్న కూలీలు

వసతులు కరువు

మండుటెండలో 'ఉపాధి' పనులు

- పని ప్రదేశాల్లో సౌకర్యాల్లేక కూలీల విలవిల
- రెండున్నర నెలలుగా అందని వేతనాలు
- జిల్లా వ్యాప్తంగా 2,15,932 జాబ్‌కార్డులు

తొర్రూరు రూరల్, మార్చి 19 : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు వసతులు కరువయ్యాయి. పనిచేసే ప్రదేశంలో వసతుల్లేక మండుటెండల్లో తండ్లాడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించడానికి తీసుకువచ్చిన ఈ ఉపాధి పథకంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని 18మండలాల్లో 2,15,932 జాబ్‌కార్డులు ఉండగా 2,60,269 మంది కూలీలు పనులకు వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణ, ఉపాధి కల్పనచేసి ఆర్థికాభివృద్ధి చెందాలనే లక్ష్యంతో 2006లో దేశంలోని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటిసారిగా యూపీఏ ప్రభుత్వం హయంలో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్, సీఎం రాజశేఖర్‌రెడ్డి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్)ను ప్రారంభించారు.



తొర్రూరు మండలం అమ్మాపురంలో ఎంపీడీవోకు సమస్యలు చెప్పుకొంటున్న కూలీలు

కానరాని కనీస వసతులు..

ఉపాధి హామీ పనులు చేపడుతున్న పనిప్రదేశాల్లో కూలీల సౌకర్యం కోసం గుడారాలతో పాటు తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచేవారు. దీంతో పాటు అదనంగా మార్చి 30 శాతం, ఏప్రిల్ 35 శాతం, మే 40 శాతం అలవెన్సు కలిపించే వారు. మంచినీళ్లు, గంపా, పార, గడ్డపారకు అదనంగా ఇచ్చే రూ.3 డబ్బులు సైతం చెల్లించడం లేదు. ప్రస్తుతం ఎలాంటి సౌకర్యాలు లేకపోగా, చేసిన పనికి కొలతల మేరకు దినసరిగా రూ.270 ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో కూలీలు ఉదయం వారివెంటతెచ్చుకున్న తాగునీటిని పని పూర్తయ్యేంత వరకు సరిపుచ్చుకోవాల్సి వస్తోంది. ఎండ తీవ్రకు అస్వస్థతకు గురైనా, పని ప్రదేశంలో గాయపడినా కనీసం మెడికల్ కిట్లు కూడా అందుబాటులో ఉండటం లేదు.

రెండున్నర నెలలుగా అందని కూలీ డబ్బులు..

ఉపాధిహామీ పథకంలో పని చేసిన కూలీలు ప్రతీ 15 రోజులకు ఒక్కసారి బిల్లు అందాల్సి ఉంటుంది. అయితే రెండున్నర నెలలు గడిచినా కూలీ డబ్బులు జమకావడం లేదు. దీంతో కొన్నిగ్రామాల్లోని పని చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. ఉపాధిహామీ సిబ్బంది, అధికారులు నిత్యం కూలీల సంఖ్యను పెంచాలని కోరినా వేతనాలు సకాలంలో రాకపోవడంతో పనులకు వారు ఆసక్తి చూపించడం లేదు. డిసెంబర్ నెల వరకు మాత్రమే డబ్బులు జమ చేశారని, తిరిగి మళ్లీ వేతనాలు ఇంతవరకు ఇవ్వలేదు. చేస్తున్న పనులకు 15 రోజులకు ఒక్కసారి డబ్బులు జమచేస్తే కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులే వెల్లడిస్తున్నారు.

జిల్లాలోని జాబ్ కార్డులు, కూలీలు

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల్లోని 461 గ్రామ పంచాయతీల్లో 2,15,932 జాబ్ కార్డులు ఉండగా 4,56,205 మంది కూలీలు ఉన్నారు. అందులో జిల్లా వ్యాప్తంగా 2,60,269 మంది కూలీలు పనులకు వస్తున్నారు.

మండలం	జాబ్‌కార్డులు	కూలీలు
బయ్యారం	15893	34027
చిన్నాగూడూరు	5985	10981
దంతాలపల్లి	9926	21746
డోర్నకల్	16293	32054
గంగారం	3719	8693
గార్ల	11028	24053
గూడూరు	20206	41683
కేసముద్రం (ఇనుగుర్తి)	20712	43148
కొత్తగూడెం	9339	20923
కురవి(సీరోలు)	19396	40309
మహబూబాబాద్	15205	30231
మరిపెడ	18507	38368
నర్సింహులపేట	10393	22325
నెల్లికుదురు	18080	40359
పెద్దవంగర	7749	18091
తొర్రూరు	13501	29214
మొత్తం	2,15,932	4,56,205

వేతనాలు రావడం లేదు



దోనుక రేణుక, ఉపాధి హామీ కూలీ, అమ్మాపురం

నిత్యం జాతీయ ఉపాధిహామీ కూలీ పనులకు వెళ్తున్నాం. కానీ నాలుగు నెలలుగా కూలీ డబ్బులు రావడం లేదు. గతంలో వేసవి కాలంలో పాత, తాగునీరుకు ఎక్కువ డబ్బులు వచ్చేవి. ఇప్పుడు ఎంతచేస్తే అంతా ఇస్తామంటున్నారు. పార, గడ్డపార తగిలి గాయమైన సమయంలో కనీసం కాటన్, మందు కూడా అందుబాటులో ఉండటం లేదు. ఎండవేడితో ఇబ్బందులు పడుతున్నాం. మెడికల్ కిట్, టెంట్, వోఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.

మెడికల్ కిట్లకు ఇండెంట్ పెడతాం



సిలార్‌సాబ్ , ఎంపీడీవో, తొర్రూరు

పని ప్రదేశంలో ఎవరికైనా గాయాలైనప్పుడు ప్రథమ చికిత్స కోసం కచ్చితంగా మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. కొన్ని రోజులుగా ఈ కిట్లు సరఫరా కావడం లేదు. ప్రాథమికంగా కాటన్, అయోడిన్ లాంటివి అందుబాటులో ఉంచడానికి ప్రయత్నిస్తున్నాం. ఇండెంట్ పెట్టి అధికారులకు అందిస్తాం. కూలీల డబ్బులు జనవరి నెల వరకు విడుదలయ్యాయి. కూలీల సంఖ్యను కూడా పెంచుతున్నాం.

సరిహద్దుల్లో అలజడి

- మహారాష్ట్ర రేపనపల్లి అడవుల్లో ఎదురుకాల్పులు
- నలుగురు మావోయిస్టుల మృతి



కొలమార్క గుట్టల నుంచి మావోయిస్టు మృతదేహాన్ని హెలీక్యాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చిన పోలీసులు

వివరాలు 7లో..

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మార్చి19: మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి, కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవనం గడపాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం సీపీఐ (మావోయిస్టు) పార్టీకి చెందిన షేక్‌ఇమాంబీ అలియాస్ జ్యోతక్క లొంగిపోయారు. ఈ సందర్భంగా ఇమాంబీపై రూ.8 లక్షల రివార్డు ఉండడంతో ఆమెకు పునరావాసం క్రింద ప్రస్తుతం రూ.10 వేల చెక్కును అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ తొర్రూరు మండలం హరిపిరాలకు చెందిన మూడేళ్ల వయస్సులో షేక్ ఇమాంబీని తనమేనత్త వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారు మనుబోతులగడ్డకు తీసుకువచ్చారు. ఆర్‌వైఎల్‌తో సంబంధాలు ఉన్న దివంగత షేక్ ఇమామ్ నర్సంపేట ఏరియా బాధ్యులుగా పనిచేస్తూ ఉండేవాడని చెప్పారు. ఆ సమయంలో ఇమామ్ ను షేక్ ఇమాంబీ వివాహం చేసుకుంది. 1984లో ఇమామ్ రైలు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పట్నుంచి ఇమాంబీ నర్సంపేటలోనే ఇమామ్ తల్లిదండ్రుల వద్ద సంవత్సరం పాటు ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత 2004లో ఆమె ఛత్తీస్‌ఘడ్‌కు వెళ్లి మావోయిస్టు పార్టీలో చేరిటైలరింగ్ టీంలో పనిచేయడం ప్రారంభించినట్లు చెప్పారు. 1992లో గోరి కొత్తపల్లి కాల్పుల్లో ఈవోఎఫ్‌లో ఆర్కేతో పాటు ఇద్దరు దళసభ్యులు బక్కన్న, సుధాకర్ మృతి చెందారని చెప్పారు.



మావోయిస్టు సభ్యురాలు షేక్.ఇమాంబీకి చెక్కును అందజేస్తున్న జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

1996లో ఆసరవెల్లి గ్రామశివారుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇవోఎఫ్‌లో కోడి వెంకన్న అలియాస్ రామన్న, లచ్చన్న మృతి చెందినట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ చెప్పారు. 1998లో కోన్నే గ్రామశివారులో కాల్పులు జరుగగా ఇద్దరు దళసభ్యులు జయతో పాటు మరోవ్యక్తి, గొర్రెల కాపరి మృతి చెందినట్లు చెప్పారు. ఆయా కేసుల్లో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇమాంబీ మావోయిస్టు పార్టీని వదిలి జనజీవన స్రవంతిలో కలవడంతో ఆమెకు ప్రభుత్వం ప్రశాంతమైన జీవితం గడపడానికి చెక్కును అందజేశారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి ప్రభుత్వం కల్పించే పునరావాసాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు. నక్సల్స్ తమ వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం అమాయక ప్రజలను ప్రభావితం చేసి, దోపిడీ చేసేందుకు యత్నిస్తున్నారని వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికైనా మావోయిస్టులు ప్రభుత్వం ఎదుటలొంగిపోతే సహాయ సహకారాలు అందించి ఆదుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య పాల్గొన్నారు.

ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు

ప్రణీత్‌రావు సొంతజిల్లా వరంగల్‌పై దృష్టిసారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం

- వార్‌రూం ఏర్పాటు చేసింది పర్వతగిరిలోనేని ప్రచారం
- వరంగల్‌లో ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకున్నట్టు చర్చ
- వ్యవహారంలో వరంగల్ నేతలున్నారంటూ అభియోగాలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



రాష్ట్రంలోనే సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం జిల్లాలోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. కీలకమలుపులుతిరుగుతున్న ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ వైపు దృష్టిమళ్లించారు. వరంగల్ జిల్లా పర్వతగిరిలోని ఓ వ్యక్తి ఇంట్లో వార్‌రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ ట్యాపింగ్ చేశారనే ప్రచారం నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామునే వరంగల్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐల ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే స్పెషల్ ఇంటిలిజెన్సీ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం మేరకే ఇద్దరు సీఐలను అదుపులో తీసుకున్నట్టు తెలిసింది. అయితే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారి అయిన ప్రణీత్‌రావు సొంత ఊరు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడిపల్లి కావటం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రణీత్‌రావు స్వగ్రామం మేడిపల్లి అయితే తన అమ్మమ్మ, అత్తగారి ఊరు పర్వతగిరి మండలం కేంద్రం. బాల్యం మొత్తం మేడిపల్లిలోనే గడిచినా ఆయనకు పర్వతగిరితోనే ఎక్కువ సత్సంబంధాలున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్ఐగా పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన ప్రణీత్‌కు సాంకేతిక విద్యపై పూర్తిస్థాయిలో ఉన్న పట్టుతో స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేసి త్వరితగతిన పదోన్నతులు పొందినట్లుగా సమాచారం. అయితే ప్రణీత్‌రావు అత్తింటివారు, సంబంధీకులు మొత్తం చాలా సంవత్సరాల క్రితమే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

పర్వతగిరిలో వార్‌రూమ్?

గత ప్రభుత్వం హయంలో నాటి పీసీసీ నేత రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలున్న కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును ఇటీవల హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన్ను విచారించిన పోలీసులు ఏఏ జిల్లాల్లో.. ఎక్కడెక్కడ వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారని, సహకరించిన ఇన్‌స్పెక్టర్ల జాబితా, ధ్వంసం చేసిన కంప్యూటర్ హార్డ్‌డిస్కుల వివరాలను రాబట్టినట్టు సమాచారం. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా పర్వతగిరిలో కూడా వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు ప్రణీత్‌రావు చెప్పినట్టు సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో ఆయనిచ్చిన సమాచారంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించి విచారిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఓ సీఐ నేతృత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తెలియరాగా.. ఈ వ్యవహారమంతా ఎలా జరిగిందనే కోణంలో విచారణ నిర్వహిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ నేతలతో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలు, కీలక అధికారుల ఫోన్‌లు ట్యాప్ చేశారని, ఈ మొత్తం వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ నేత కూడా ఉన్నారని ప్రచారం జరగడం, దర్యాప్తు బృందాలు వరంగల్‌పై నిఘా పెట్టడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రణీత్‌రావు ఎవరో తెలియదని ఎర్రబెల్లి స్పష్టీకరణ

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతుండటం, సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతుండటంపై ఆయన స్పందించారు. తనకు ప్రణీత్‌రావు ఎవరో తనకు తెలియదని మంగళవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. పర్వతగిరిలో ప్రణీత్‌రావుకు బంధువులు ఉండటం మూలంగా వచ్చి పోయేవాడని, తనను కొందరు కావాలనే ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తానెవరికీ భయపడేది లేదని, తన పేరు చెప్పాలని ప్రణీత్‌రావుపై ఒత్తిడి తెస్తున్నారని ఎర్రబెల్లి పేర్కొనటంతో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం ముందుముందు ఎలాంటి మలుపులు తిరుగుతుందోనన్న చర్చ జరుగుతోంది.

నేడు గూడూరులో వాహనాలకు వేలం

గూడూరు, మార్చి 19 : గూడూరు ప్రొహిబిషన్ అండ్‌ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి కిరణ్ సమక్షంలో వేలంపాట నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ వేలంలో లారీ, వ్యాను, తవేరా, టాటా మ్యాక్సిమో, బోలేరో గూడ్స్ క్యారియర్ వాహనం, 19 ద్విచక్రవాహనాలు ఉన్నట్లు తెలిపారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనే అభ్యర్థులు ఫోర్ వీలర్లకు రూ.లక్ష, ద్విచక్రవాహనాలకు రూ.20 వేల చొప్పున విడివిడిగా చెల్లించి, వేలంలో పాల్గొని స్పష్టం చేశారు.

కోరుకొండపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.1.60 లక్షల పట్టివేత

కేసముద్రం, మార్చి19 : జిల్లా సరిహద్దు ప్రాంతమైన కేసముద్రం మండలం కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం రూ.1.60లక్షలను పట్టుకున్నట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. వరంగల్ న్యూశాయంపేటకు చెందిన ఆనందపు శ్రీతన్ అనేవ్యక్తి ఈ నగదును ఎలాంటి రశీదులు లేకుండా తరలిస్తుండగా సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహిమల తల్లి.. శ్రీముసలమ్మ

నేటి నుంచి మూడురోజులు మహా జాతర

దేవాలయాన్ని ముస్తాబు చేసిన ఈవో, పూజారులు • వేలాదిగా తరలిరానున్న భక్తులు



గుంజేడు ముసలమ్మ దేవాలయం

శ్రీముసలమ్మ దేవత

కొత్తగూడ, మార్చి19 : చుట్టూ దట్టమైన అడవి.. పచ్చటి పొలాలు.. ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలిసిన శ్రీముసలమ్మ దేవత మహాజాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. భక్తుల కొంగబంగారం, కోరికలు తీర్చే ఇలవేల్పు తల్లికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఆదివాసీ సంస్కృతికి, సంప్రదాయానికి నిలయమైన ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే రెండో అతిపెద్ద ఆదివాసీ జాతరగా గుర్తింపు పొందింది.

కొత్తగూడ మండలం గుంజేడులో శ్రీముసలమ్మ జాతరలో భక్తిభావం, ఆధ్యాత్మికత నెలకొననుంది.

నాడు ఆదివాసీ దేవతగా..

ఆదివాసీ ఇలవేల్పుగా వెలసిన శ్రీముసలమ్మ దేవత.. నేడు అం దరి మొక్కులను అందుకుంటున్నారు. ఆదివాసీలతో పాటు ఆదివాసేతరులు కూడా తల్లిని కొలుస్తున్నారు. ఏజెన్సీతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు జాతరకు పోటెత్తనున్నారు. వ్యవసాయ పనులు మొదలు పెట్టేముందు ముసలమ్మ దేవతను దర్శించుకోవటం అనవాయితీగా మారింది. గుడి సమీపంలో ప్రవహించే ముత్యాలమ్మవాగు నుంచి నీరు తీసుకుని వెళ్లి వ్యవసాయ భూము ల్లో చల్లుకోవటం కొనసాగుతోంది. పంట పండించుకున్న తర్వాత అందులో కొంత భాగాన్ని దేవతకు సమర్పిస్తూ, మొక్కులు చెల్లించుకుంటున్నారు. సంతానం లేనివారు ముసలమ్మ దేవత ముందు సంతు (వరం) పడుతుంటారు.

దేవాదాయ శాఖ ఏర్పాట్లు..

బుధవారం (నేటి) నుంచి మూడురోజులు శ్రీముసలమ్మ జాతరను నిర్వహించుకునేందుకు దేవాదాయశాఖ ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని ముస్తాబు చేశారు. నాడు ప్రతీ శుక్రవారం దేవతకు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చేవారు. నేడు ప్రతీరోజు భక్తులు వస్తున్నారు. శ్రీముసలమ్మ దేవతకు ప్రతి రెండేళ్లకు ఒకసారి మహాజాతర నిర్వహిస్తుంటారు..

నిర్వహణ ఇలా..

నేడు(బుధవారం) సాయంత్రం గుంజేడు గ్రామస్తులు ముత్యాలమ్మ దేవతకు బోనాలు సమర్పిస్తారు. గురువారం శ్రీముసలమ్మ దేవతను గుట్టమీద నుంచి తీసుకువచ్చి గద్దెపై ప్రతిష్టిస్తారు. శుక్రవారం భక్తులు శ్రీముసలమ్మ దేవతను ద ర్శించుకుంటారు. సాయంత్రం శ్రీముసలమ్మ దేవతను వనప్రవేశం చేయిస్తారు. శ్రీముసలమ్మ జాతరకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని ఈవో భిక్షమాచారి, పూజారులు తోలెం చిన్ననర్సయ్య, తోలెం వెంకటేశ్వర్లు, తోలెం వెంకన్న, కిరణ్‌కుమార్, రాంబాబుల, నవీన్‌కుమార్, అనంతరావు కోరారు.

ఎంపీ ఎన్నికల్లో సైనికుల్లా పనిచేయాలి

బీజేపీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ విజయం కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పార్టీ క్రమ శిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు కోరారు. మహబూబాబాద్ ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీలు చేసిన అక్రమాల ను, అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీజేపీ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలన్నారు. ప్రతీ కార్య కర్త ఇంటింటికి తిరుగుతూ బీజేపీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీతోనే దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందని, మూడోసారి మోదీని ప్రధానిని చేయడం కోసం మనమంతా ఐక్యంగా ఉంటూ బీజేపీ పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాస్, ప్రభారి వెంకటనారాయణరెడ్డి, బలరాం, రంగ కిరణ్, వద్దిరాజు రాంచందర్‌రావు, సింగారపు సతీష్ పాల్గొన్నారు.

రుణసాయానికి దూరం..

వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ పథకానికి నోచుకోని రైతులు

- అవగాహన లేకపోవడమే కారణం
- గోదాముల్లో పంటను నిల్వ చేసుకుంటే 'రైతుబంధు'
- రీజియన్ పరిధిలో రూ.28కోట్లు కేటాయింపు..
- రుణం తీసుకుంది మాత్రం నలుగురే..



వరంగల్ వ్యవసాయం, మార్చి 19 : వ్యవసాయ మార్కెట్లలో పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు ఆ పంటను గోదాముల్లో నిల్వ చేసుకుని, దానిపై సదరు రైతులు రుణం పొందేందుకు వీలుగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుబంధు (రుణసాయం) పథకాన్ని 20ఏళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ మార్కెట్లలో రైతుల నుంచి పన్ను వసూలు చేయడమే కాదు.. రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతులకు రుణం ఇచ్చి ఆసరాగా నిలిచే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేపెట్టింది. పంటను అమ్మకానికి తీసుకువచ్చినప్పుడు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోతే... ఆ సమయంలో ఆ రైతు సరుకును మార్కెట్ కమిటీ గోదాముల్లో లేదంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని ఆ రశీదును మార్కెట్ కమిటీలో అందజేసే, అధికారులు సదరు రైతు పంట సరుకు విలువలో 75శాతం, లేదా రూ.2లక్షలకు మించకుండా అరు నెలల వరకు వడ్డీలేని రుణాన్ని రైతుకు అందజేస్తారు. ఆ తరువాత రైతు పంటను మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించి తీసుకున్న రుణాన్ని మినహాయించుకుని మిగతా డబ్బులు రైతుకు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు.

కేటాయించింది రూ.28కోట్లు... ఇచ్చింది రూ.7.71లక్షలే..

మార్కెట్ రీజినల్ పరిధిలో 19 జిల్లాలు, 110 మార్కెట్ కమిటీలకు 2023-24 సంవత్సరానికి గాను రైతుబంధు పథకం కింద మార్కెటింగ్‌శాఖ రూ.28కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు వరంగల్ జిల్లాలో ఒక రైతుకు రూ.2లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో ఒక రైతుకు రూ. 1.75లక్షలు, ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులకు రూ.4లక్షలు కలిపి రైతుబంధు పథకం నలుగురు రైతులకు రూ.7.71లక్షలు మాత్రమే ఇచ్చారు. అయితే ఈ రైతుబంధు పథకంపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పథకం నిర్వీర్యమవుతోంది. అధికారులు సైతం కల్పించడానికి ఆసక్తి చూపడం లేదు. రైతులకు అవగాహన కల్పిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మంచి ధర వచ్చే వరకు సరుకునే దాచుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అసలే ఉద్యోగుల కొరతతో ఉన్న అధికారులకు ఇప్పటికే పని ఒత్తిడికి లోనవుతున్న క్రమంలో రైతుకు మంచి అవకాశాల గురించి చెప్పే ఓపిక లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులకు సేవలందిస్తున్నాం..



మల్లేశం, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్

రైతుబంధు (రుణసాయం) పథకం కింద రైతులకు సేవలందిస్తున్నాం. ఈ సంవత్సరం ధాన్యం, మొక్కజొన్న, ఇతర ఉత్పత్తులకు ఎంఎస్‌పీ ధరల కంటే మార్కెట్లో ఎక్కువ ధరలు పలుకడంతో రైతులు రైతుబంధు పథకాన్ని వినియోగించుకో లేదు. సాధారణంగా రైతులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రైతుబంధు పథకం ద్వారా రుణం తీసుకుంటారు. ముఖ్యంగా మార్చిలో రైతులు రుణం తీసుకుంటుంటారు. రైతుబంధుపై మార్కెట్లో రైతులకు తెలిసేలా మైక్‌ల ద్వారా అనౌన్స్ చేయిస్తున్నాం.

పులిపిరికి అరుదైన చికిత్స

ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు



పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

వరంగల్ జిల్లా, మార్చి 19: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండనందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురు, శుక్రవారం మూడు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లలోని సంప్రదించాలన్నారు.

న్యాక్ జాతీయ సదస్సులో వీసీ రమేశ్



న్యాక్ జాతీయ సదస్సులో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఇతర అధికారులు

కేయూ క్యాంపస్, మార్చి 19: విద్యాసంస్థల స్వయం సమృద్ధితో విద్యా విధానాల్లో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలపై మంగళవారం దేశ వ్యాప్తంగా బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్ నుంచి సదస్సులో పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల కోసం న్యాక్ అధికారులు దేశంలోని వివిధ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్లు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో న్యాక్ అక్రిడేషన్ విధానం, ప్రస్తుతం ఉన్న విధానంలో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలు, అక్రిడేషన్ పొందిన విద్యాసంస్థలకు వచ్చే ప్రయోజనాలతోపాటు విద్యార్థులకు కల్పించాల్సిన, సమాజానికి అవసరమైన విద్యాసంస్థల స్వయం సమృద్ధి కోసం చేయాల్సిన బాధ్యతలు చర్చించారు. డిజిటలీకరణ, అకడమిక్ క్రెడిట్స్, ఫిర్యాదుల పరిష్కారం యంత్రాంగం, అభిప్రాయ సేకరణ, విద్యాసంస్థల్లో ఉన్న ఇంటర్నల్ క్యాలిటీ అస్యూరెన్స్ సెల్ పనితీరుపై చర్చించారు. జాతీయ విద్యావిధానంలో పొందుపరిచిన లక్ష్యాలను అందుకునేందుకు దృష్టి పెట్టాల్సిన అంశాలనూ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, కేయూ క్యాలిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, ప్రొఫెసర్ ఎన్.గోపి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి దుర్మరణం



క్షితిజ్ రాజ్ (ఫైల్)

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: అతి వేగం ఓ టెక్నోక్రాట్‌ను బలితీసుకుంది. కారును అతి వేగంగా నడపడం వల్ల సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తార్నాక వైజంక్షన్‌లో డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో వరంగల్ నిట్ విద్యార్థి క్షితిజ్‌రాజ్(22) దుర్మరణం పాలయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్షితిజ్‌రాజ్ నిట్‌లో ఈఈఈ నాలుగో సంవత్సరం చదువుతు న్నాడు. ఈ ఘటనలో మరో నలుగురు నిట్ విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వివరాల్లోకి వెళితే.. స్నేహితుడి ఇంటర్వ్యూ కోసం సోమవారం వరంగల్ నుంచి సెల్ఫ్ డ్రైవింగ్ కార్‌ను అద్దెకు తీసుకొని క్షితిజ్‌రాజ్, ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థి హర్షిత్ మహేశ్వరి, ఈఈఈ నాలుగో సంవత్సరం విద్యార్థి అర్జునతన్వర్, ఎంఎంఈ నాలుగో సంవత్సరం విద్యార్థి నవీన్ దవన్, ఎంఎంఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కపిల్ హైదరాబాద్ వెళ్లారు. తార్నాక సమీపంలోని పీఎస్ వై జంక్షన్ సమీపంలో రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో అతివేగంగా నడుపుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో క్షితిజ్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా నలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తార్నాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిట్ విద్యార్థి రోడ్డు ప్రమాదంతో దుర్మరణం పాలవడంతో నిట్‌లో ఒక్క సారిగా విషాదఛాయలు అలముకొన్నాయి.

సరిహద్దుల్లో అలజడి

మహారాష్ట్ర రేపనపల్లి అడవుల్లో ఎదురుకాల్పులు ● నలుగురు మావోయిస్టుల మృతి

మహదేవపూర్, మార్చి 19: పార్లమెంటు ఎన్నికల వేళ తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో మంగళవారం తెల్లవారుజామున అలజడి రేగింది. సుమారు రెండున్నర గంటలపాటు పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన హోరాహోరీ ఎదురుకాల్పుల్లో తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. గడ్చిరోలి జిల్లా రేపనపల్లికి సౌత్ ఈస్ట్ ప్రాంతంలో 8 కిలోమీటర్ల దూరంలోని కొలమార్క గుట్టల్లో ఈ ఘటన జరిగింది. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతుందన్న పక్కా సమాచారంతో అహెరీ అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. తెల్లవారుజామున ఒక డెన్‌లో ఉన్న మావోయిస్టులను చుట్టుముట్టిన పోలీసులు కాల్పులు ప్రారంభించగా మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగడంతో సుమారు రెండున్నర గంటల పాటు కొలమార్క గుట్టల ప్రాంతంలో తుపాకీ చప్పుళ్లతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. కాల్పులు ముగిసిన తర్వాత పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా ఈ ఘటనలో తెలంగాణలోని మంగీ- ఇంద్రవెల్లి ఏరియా కమిటీ సభ్యుడు, కొమురంభీం మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన వర్గీస్(28), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భైరాన్‌ఘర్ జిల్లా కొర్రాంకు చెందిన జిల్లా కమిటీ సభ్యుడు, సిర్పూర్ - చెన్నూరు కార్యదర్శి పాండు అలియాస్ మంగులు (32), ప్లాటూన్ మెంబర్లు కురుసంగి రాజు, కుడిమేత వెంకటేశ్ మరణించినట్లు గుర్తించారు. సంఘటనా స్థలంలో ఏకే 47 రైఫిల్ ఒకటి, ఒక కార్బన్, మరొక కంట్రీమేడ్ పిస్టల్, మావోయిస్టుల సాహిత్యం, పేలుడు పదార్థాలు, వంట సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిగిన సంఘటనా స్థలం నుంచి మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకొని వెళ్లారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఈ నలుగురిపై మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం రూ. 36లక్షల రివార్డును ప్రకటించడం విశేషం. ఇక తప్పించుకున్న మావోయిస్టులు ఏయే ప్రాంతాలవైపు వెళ్లే అవకాశం ఉందన్న పక్కా ప్రణాళికలతో పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. కొలమార్క గుట్టలతో పాటు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్టపరిచి తప్పించుకున్న మావోయిస్టులను మట్టుబెట్టడమే లక్ష్యంగా పోలీసులు కూంబింగ్ చేస్తున్నారు.

టెన్షన్.. టెన్షన్..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 72 గంటల్లోపే మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కట్టడికి కూంబింగ్ చేపట్టారు. అలాగే రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎదురుకాల్పుల్లో గాయపడిన మావోయిస్టులు చికిత్స కోసం తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో గోదావరి తీర ప్రాంతం వెంట పటిష్ఠ భద్రతను అప్రమత్తం చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇక తాజా ఘటనలో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఐజీ సందీప్ పాటిల్, గడ్చిరోలి జోన్ డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ జగదీష్ మీనా, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్‌లను ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వారి ఉన్నతాధికారులు ప్రశంసించారు.


కొలమార్క గుట్టల నుంచి మావోయిస్టు మృతదేహాన్ని హెలీక్యాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చిన పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

అంతర్రాష్ట్ర వంతెనపై పోలీసుల తనిఖీలు

మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో అప్రమత్తమైన కాళేశ్వరం పోలీసులు అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. గోదావరి మీదుగా మావోయిస్టులు తెలంగాణలోకి వచ్చే అవకాశం ఉండడంతో గ్రామస్థులకు అవగాహన కల్పించి.. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే సమాచారం అందించాలని సూచిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను మహదేవపూర్ సిఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ పర్యవేక్షిస్తున్నారు.

ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతల చర్చలు

- కడియం కావ్యను మార్చాలని ఉద్యమకారుల డిమాండ్
- అదిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్న నేతలు
- లేదంటే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిక

రాంనగర్, మార్చి19: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతలు దాస్యం వినయ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, సుందర్ రాజ్ భేటీ అయ్యారు. మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో భేటీ అయిన నేతలు.. నిరసన గళం వినిపిస్తున్న ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, బండి రజనీకుమార్, వీరేందర్, చింతల యాదగిరితో చర్చలు జరిపారు. పార్టీలో సభ్యత్వంలేని, రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కడియం కావ్యను ఎలా అభ్యర్థిగా ప్రకటిస్తారని ఉద్యమకారులు ప్రశ్నించారు. తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని చేస్తున్న అభ్యర్థనను ఏ మాత్రం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని వారు నేతలను ప్రశ్నించారు. ఒకే ఇంట్లో నుంచి ఇద్దరికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఏంటని వారు నేతల దృష్టికి తీసుకువచ్చారు. వారంరోజుల్లో కడియం కావ్యను మార్చి తమలో ఎవరికైనా అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ అభ్యర్థనను పార్టీ అధిష్ఠానం పట్టించుకోకుంటే జయశంకర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్ పెట్టి కార్యాచరణ ప్రకటిస్తామని నేతలకు తేల్చిచెప్పారు. కాగా, ఉద్యమకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని నేతలు పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. అధిష్ఠానం సూచించిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నేతలు పేర్కొన్నారు.

క్రషర్స్ యజమానులకు సమస్యలు పరిష్కరించాలి


డీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి19: మైనింగ్ శాఖ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లును కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న డీడీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్టోన్ క్రషర్స్ యజమానులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డీడీ వెంకటేశ్వర్లును కోరారు. అనంతరం మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సాంబశివరావును కలిశారు. కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుల పేరాల మదుసూధన్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్, స్టోన్ క్రషర్స్ యజమానులు దేవేందర్ రెడ్డి, రాంరెడ్డి, సుజిత్‌రావు తదితరులు డీడీని కలిసిన వారిలో ఉన్నారు.

లాసెట్ ద్వారా ఎంజేపీ లా కళాశాలల్లో ప్రవేశాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో నెలకొల్పిన రెండు లా కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న లా సెట్ ర్యాంకు ద్వారానే సీట్లు కేటాయించనున్నట్లు ఎంజేపీ ఆర్సీవో మనోహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మహేశ్వరంలో బాలుర రెసిడెన్షియల్ లా కళాశాల, కాజీపేటలో నెలకొల్పిన బాలికల రెసిడెన్షియల్ లా కళాశాలలో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు కళాశాలల్లో 5 ఏళ్ల లా కోర్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ పాసై లా సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా సీట్లు పొందవచ్చునని తెలిపారు. కాగా, లాసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉందని తెలిపారు.

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: విదేశాల్లో ఎంఎస్, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత విభాగం ప్రకటన జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. www.nosmsje.gov.in అనే వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు.

చేసిన తప్పును ప్రజలు ప్రజలు గుర్తించారు..

● దొంగ హామీలను నమ్మి బీఆర్ఎస్‌ను ఓడించారు.. ● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

రాంనగర్, మార్చి 19: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఇప్పటి వరకు కేవలం రెండు హామీలు మాత్రమే అమలు చేశారని ఆయన చెప్పారు. రేవంత్‌రెడ్డికి మాయమాటలు చెప్పడం మొదటి నుంచి అలవాటేనన్నారు. అవినీతి చేసిన నేతలు ఆస్తులు కాపాడుకు నేందుకు పార్టీ మారుతున్నారని ఆయన ధ్వజ మెత్తారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాని ఎర్రబెల్లి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ భాస్కర్ మాట్లాడుతూ.. స్వలాభం కోసం నేతలు పార్టీ మారుతున్నారని ఆరోపిం చారు. శ్రేణులు వారివెంట వెళ్లడం లేదన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేదీ లేదని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉందన్నారు. ఎవరో కొందరు పార్టీ వీడినంత మాత్రాన జరిగే నష్టం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దని సూచించారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ కుడా ఛైర్మన్ సుందర్‌రాజ్, వాసుదేవ రెడ్డి, లలితాయాదవ్, కడియం కావ్య, ఇండ్ల నాగేశ్వర్‌రావు, చింతల యాదగిరి వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా పలువురు వర్ధన్నపేట బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. పదేళ్ల పదవులు అనుభవించి, ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ వీడటం ఎంతవరకు సమంజసమని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి అన్నారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచి తన స్వలాభం చూసుకున్నాడని విమర్శించారు. పార్టీ మారిన వారితో నష్టం లేదని, భవిష్యత్‌లో కలిసికట్టుగా పనిచేసి వర్ధన్నపేటలో బీఆర్ఎస్‌ను పటిష్ఠం చేస్తామని వారు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రైతు సుధాకర్ (ఫైల్)

వేలేరు(ధర్మసాగర్)మార్చి 19: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చ లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ.హరిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీచర గ్రామానికి చెందిన పిట్ల సుధాకర్(43) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో కొన్నేళ్ల నుంచి మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాడు. వ్యవసాయ బావిలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రూ.10లక్షలు అప్పులు చేసి బావిలో సైడ్‌బోర్లను సైతం వేయించాడు. దీంతో పాటు అప్పులు చేసి తన కూతురు రవళి వివాహం చేశా డు. వ్యవసాయంతో చేసిన అప్పులు తీర్చాలనుకున్నప్పటికీ సాగు చేసిన పంటకు సాగు నీరు లేకపోవడంతో దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చడం ఎలా అని మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్దకు సోమవారం రాత్రి వెళ్లి సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుధాకర్‌ను చుట్టు పక్కల రైతుల గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చే సరికే సుధాకర్ మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు విచ్చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నాడు.

పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు కనిపిస్తే చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు కనిపిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మంగళవారం ఉదయం పరీక్షకు ముందు నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల నిర్వాహకులు సీఎస్, డీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఇతరత్రా నిర్వాహకులు సెల్‌ఫోన్లను పరీక్షాకేంద్రంలోకి తీసుకెళ్లరాదని ఆయన స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలు, హెడ్మాస్టర్ల గదులు, బాత్‌రూమ్‌లలో ఎక్కడా సెల్‌ఫోన్‌లు లేకుండా చూడాలని సెట్ కాన్ఫరెన్స్‌లో స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆయన ప్రకటనలో హెచ్చరించారు. హనుమకొండ జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా సెల్‌ఫోన్లు వినియోగించినట్లు తన దృష్టికి రాలేదని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

● మేడారం విధులు ముగించుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదం ● 20రోజులుగా మృత్యువుతో పోరాటం


దేవానంద్(ఫైల్)


మృతుడి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బొట్ల దేవానంద్ (40) అనే పారిశుధ్య కార్మికుడు మంగళవారం మృతిచెందాడు. 20 రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన బొట్ల దేవానంద్ 20 యేళ్లుగా నగర పాలక సంస్థలో శానిటేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునిల్ పరిధిలో పని చేస్తున్నాడు. కాగా, మునిసిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఫిబ్రవరి 15 నుంచి 29 వరకు మేడారం జాతరలో విధులు నిర్వర్తించాడు. జాతర విధులు ముగించుకుని 29న సాయంత్రంస్వచ్ఛభారత్ ఆటోను నడుపుకుంటూ నగరానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ములుగు జిల్లా గట్టమ్మ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ దేవానంద్ ఆటోను ఢీకొట్టి వెళ్లిపోయింది. దేవా నంద్ కాళ్లు విరిగి కడుపులో బలమైనగాయాలయ్యాయి. అక్కడి వారు గుర్తించి 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు. దీంతో హైదరా బాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా వైద్యానికి శరీరం సహకరించకపోవడంతో మంగళవారం మృతి చెందాడు. దేవానంద్ చికిత్సకు ఇప్పటివరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబానికి ఏ అధికారులు, ఏ సంఘం నాయ కులు సహకరించలేదని, ఆర్థికంగా చితికిపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతునికి కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల నియామకానికి కసరత్తు

మంత్రుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

హనుమకొండ టౌన్, మార్చి19: బీఆర్ఎస్ హయాంలో నియామకమైన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం తొలిగించింది. ఇప్పుడు కొత్త (ఫైనాన్స్, ఆపరేషన్స్, ప్రాజెక్ట్స్, హెచ్ఆర్ అండ్ ఐఆర్) డైరెక్టర్లను నియమించేందుకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో డైరెక్టర్లుగా పనిచేసేందుకు ఎన్పీడీసీఎల్‌తో పాటు, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కోలో పని చేస్తున్న చాలామంది సీఈలతో పాటు రిటైర్డ్ సీఈలు ఈనెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీసులో ఉన్నవారైతే ఎస్ఈ, సీఈగా కలిపి ఐదేళ్లు, మొత్తంగా 15 ఏళ్లు సర్వీసు పూర్తయి ఉండాలని, రిటైర్డ్ అధికారులైతే 62 ఏళ్లు దాటకూడదని షరతు విధించింది. ఈ నిబంధనల ప్రకారం ఒక్కో డైరెక్టర్ పోస్టుకు 10 నుంచి 15 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. సీఎండీ అధ్యక్షతన ఏర్పాటయ్యే ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూ ఆధారంగా ఒక్కొక్క డైరెక్టర్ పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తారు. వీరి పేర్లను సీల్డ్‌కవర్‌లో సంబంధిత మంత్రితో పాటు సీఎం దృష్టికి పంపిస్తే ముగ్గురిలో ఒక్కరిని ఖరారు చేసి ఎస్పీడీసీఎల్‌కు సమాచారం ఇస్తారు. కంపెనీ డైరెక్టర్ పేరును ప్రకటించి ఆఫర్ లేఖను మంజూరు చేస్తుందని ఎస్పీడీసీఎల్ సీనియర్ అధికారులు చెబుతున్నారు.

కాగా, డైరెక్టర్ పోస్టులను చేజిక్కించుకునేందుకు ఇప్పటికే పలువురు పావులు కదుపుతున్నారు. సంబంధిత మంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలతో పాటు సన్నిహితులతో పైరవీలు చేస్తున్నారు. ఇదిలా వుండగా, ఎలక్షన్ కోడ్ రాకముందే నోటిఫికేషన్ జారీ, దరఖాస్తుల ప్రక్రియ ముగిసినందున నియామకాలకు ఎలాంటి అడ్డంకి రాదని పలువురు అభిప్రాయ పడుతు న్నారు. ఒక వేళ అడ్డంకిగా మారితే నియామకానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

దాట్లలో పీడీఎస్ రైస్ స్వాధీనం

దంతాలపల్లి, మార్చి19 : మండలంలోని దాట్ల గ్రామంలో మంగళవారం ఆరు క్వింటాళ్ల ప్రజాపంపిణీ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై కరుణాకర్ మాట్లాడారు. దాట్లకు చెందిన సంపెట శ్రీను ఆటోలో దంతాలపల్లి వైపు తరలిస్తున్న 6 క్వింటాళ్ల పీడీఎస్ రైస్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన రైస్‌ను తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

దంతాలపల్లిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

దంతాలపల్లి, మార్చి 19 : మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రౌడీషీటర్లకు తొర్రూరు డీఎస్పీ సురేష్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న పార్లమెంట్ ఎన్నికలు ఉండడంతో ముందస్తు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో రౌడీషీటర్లు శాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కేమరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ, ఎస్సై కరుణాకర్ పాల్గొన్నారు.

చెక్ పోస్టును తనిఖీ చేసిన ఎస్పీ

దంతాలపల్లి, మార్చి 19 : మండల కేంద్రంలోని సూర్యాపేట రోడ్డు శివారు శ్రీ బాలాజీ ఫంక్షన్ హాల్ ఎదుట ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును మంగళవారం జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాహనదారుల వద్ద రూ.50వేల కంటే ఎక్కువగా ఉంటే సంబంధిత ధ్రువపత్రాలు చూపాలన్నారు. మద్యం, గుడుంబా, నగదుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డీఎస్పీ సురేష్, సీఐ, ఎస్సై కరుణాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు, మార్చి 19 : అయోధ్యపురం సబ్‌స్టేషన్ పరిధిలో అయోధ్యపురం, పొనుగోడు, గాజులగట్టు, గుండెంగ గ్రామాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ అమ్ములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు మానుకోటకు రజాకార్ చిత్ర యూనిట్ సభ్యులు

- సినిమా విజయోత్సవంలో నటీనటులు
- సినీ సంగీత దర్శకుడు బీమ్స్ సిసి రోలియో

మహబూబాబాద్ టౌన్, మార్చి 19 : జిల్లా కేంద్రానికి గురువారం రజాకార్ చిత్రం యూనిట్ సభ్యులు వస్తున్నారని సినీ సంగీత దర్శకుడు బీమ్స్ సిసి రోలియో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా విజయోత్సవంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రజాకార్ చిత్రం ప్రదర్శిస్తున్న లక్ష్మి, సూర్య థియేటర్లకు మార్నింగ్‌షో సమయంలో రానున్నారని చెప్పారు. రజాకార్ చిత్రం హీరో బాబిసింహా, అనసూయ, ఇంద్రజతో పాటు నటీనటులు మానుకోటలో రజాకార్ సినిమా విజయోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

మద్దతు ధర రాక అంగడి వేలం వాయిదా


అంగడి వేలంకు హాజరైన అధికారులు, టెండర్‌దారులు

గూడూరు, మార్చి 19 : గూడూరు అంగడికి మద్దతు రాక వేలంను వాయిదా వేస్తున్నట్లు ప్రత్యేక అధికారి శ్వేత, పంచాయతీ కార్యదర్శి భీమా తెలిపారు. గూడూరు జీపీ కార్యాలయంలో మంగళవారం రెండోసారి అంగడి వేలం నిర్వహించగా కలకత్తా తండాకు చెందిన కటార్‌సింగ్ రూ.13.15 లక్షలకు టెండర్ వేశారు. మద్దతు ధర రాకపోవడంతో మరోసారి అంగడి వేలం వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వేలం పాట ఎప్పుడు నిర్వహించేది పత్రిక ప్రకటన ద్వార తెలియజేస్తామని చెప్పారు.

కొనసాగుతున్న టెన్త్ పరీక్షలు


మానుకోటలోని మాంటిస్సోరీ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎస్పీ సుదీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి19 : మహబూబాబాద్ జిల్లాలో రెండోరోజు హిందీ సబ్జెక్టు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖాధికారి రామారావు మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 49 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన పరీక్షలకు 8,184 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8,162 (99.75శాతం) మంది హాజరు కాగా, 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 8,182 మందికి గాను 8,162 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరైయ్యారని, ప్రవేటు విద్యార్థులు ఇద్దరు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఇద్దరు హాజరయ్యారని చెప్పారు. జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సుదీర్ రాంనాథ్ కేకన్ సందర్శించారు. పట్టణ కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ సందర్శించారు. ఆయా సెంటర్లను సందర్శించిన ఎస్పీ సుదీర్ రాంనాథ్ కేకన్, జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ మాట్లాడుతూ పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎవరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. పరీక్ష కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని ఆదేశించారు. పరీక్ష సెంటర్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు నాలుగు సెంటర్లు, ఏసీజీఈ మందుల శ్రీరాములు ఐదు సెంటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 15 సెంటర్లను సందర్శించినట్లు వెల్లడించారు. మొత్తంగా రెండోరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

గోడకూలి బాలుడి మృతి

మేడిపల్లి, మార్చి19 : సిమెంట్ గోడకూలి బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం మేడిపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మేడిపల్లి ఎస్సై శ్యామ్ రాజ్ తెలిపిన వివరాలప్రకారం. మేడిపల్లి శివారులోని నూతనంగా నిర్మి స్తున్న పౌల్ట్రీ ఫాంలో మహబూబాబాద్ జిల్లా వొడ్డెరగూడెంకు చెందిన సంపంగి సంగీత, శ్రీను దంపతులు తమ కొడుకు గణేష్ (4)ను తీసుకొని మేడిపల్లిలో జరుగుతున్న పౌల్ట్రీఫాంలో కూలీపనులు చేయడానికి వచ్చారు. ఈక్రమంలో అదేఫాంలో పని చేస్తున్న పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం దొంగతుర్తికి చెందిన అమరగోని రాజు కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి సిమెంట్ గోడను ఢీకొట్టాడు. దీంతో సిమెంట్ గోడ పక్కనే నిద్రిస్తున్న బాలుడిపై గోడ కూలడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పొట్టకూటి కోసం వచ్చి తమ కుమారుడిని కోల్పోవడంతో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. తల్లి సంపంగి సంగీత ఫిర్యాదు మేరకు డ్రైవర్ అమరగోని రాజుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'చిన్నసమ్మన్న మృతి తీరనిలోటు'

మహబూబాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : సీపీయూఎస్ఐ పార్టీ దళిత, బహుజన, శ్రామిక విముక్తి నాయకుడు గొల్లపల్లి చిన్నసమ్మన్న అకాలమృతి ఉద్యమాలకు తీరనిలోటు అని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న అన్నారు. ఆయన పేరిట మహబూబాబాద్ 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి మంగళవారం ఒక లేఖను పంపారు. గొల్లపల్లి చిన్నసమ్మన్న సీపీఐ (ఎంఎల్) జనశక్తి పార్టీలో పనిచేస్తున్న సమయంలో విప్లవ ద్రోహులు ఇచ్చిన సమాచారంతో బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరులైన వారి అమరత్వాన్ని అందిపుచ్చుకుని వారి ఆశయ సాధన కోసం పనిచేశారని చెప్పారు. మారోజు వీరన్న కులవర్గ సిద్ధాంతమే ఏకైక మార్గమని భావించి ఏర్పాటు చేసిన సీపీయూఎస్ఐ పార్టీ దళితబహుజన శ్రామిక విముక్తిలో సమ్మన్న చేరి క్రియశీల నాయకుడిగా ఎదిగారని పేర్కొన్నారు. భూపాలపల్లి, మంథని, మహదేవ్‌పూర్ ప్రాంతంలో అమరులు రమేషన్న, సూర్యమన్నకు అండగాఉంటూ ఆదివాసీ ఉద్యమంలో అణగారిన కులాలకు మారోజు వీరన్న చూపించిన మార్గంలో పయనిస్తూ ఎంత నిర్బంధం ఉన్న సీపీయూఎస్ఐ పార్టీని ముందుకు తీసుకుపోవడంలో ముఖ్య భూమిక పోషించారనిచెప్పారు. చిన్నసమ్మన్న నాటి రాజ్యం పోలీస్ చిత్రహింసలకు బలైన, అనారోగ్యం పాలైనప్పటికి నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడారని, ఆయన మృతి విప్లవోద్యమాలకు తీరని లోటు అని చెప్పారు. దళిత బహుజన జనతా ప్రజాస్వామిక విప్లవం, మారోజు వీరన్న, రమేషన్న, సూర్యమన్న కలలు కన్న సబ్బండ కులాల రాజ్యం కోసం ప్రతీ ఒక్కరు పోరాడాలని పిలుపునిచ్చారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు : డీఎస్పీ


ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాలను పరిశీలిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

డోర్నకల్, మార్చి 19 : రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పోలీస్ సిబ్బంది 24 గంటలు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మానుకోట డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును సందర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అనిఅడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఉయ్యాలవాడ గ్రామాన్ని సందర్శించి పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసే ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. అక్కడ్నుంచి ముల్కలపల్లి వద్ద జాతీయ రహదారి 365/ఎ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అపై మన్నేగూడెం, అందనాలపాడు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసే పాఠశాలలను పరిశీలించారు. డీఎస్పీ వెంట సీఐ ఉపేందర్‌రావు ఉన్నారు.

'పౌష్టికాహారం అందించాలి'


వడ్డెకొత్తపల్లిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో హైమవతి

పెద్దవంగర, మార్చి 19 : అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణీలకు విధిగా పౌష్టికాహారం అందించాలని సీడీపీవో హైమవతి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్డెకొత్తపల్లిలో గర్భిణీలకు, బాలింతలకు పోషక పదార్థాలపై ఆవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్ననాటి నుంచి పిల్లలపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని కోరారు. పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. వ్యక్తి పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవితరెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ అశోక్, అంగన్‌వాడీ టీచర్లు సుకన్య, అరుణ, మంజుల, రేణుక, సునిత, అండాలు, సరళ, నీలవేణి, ఝాన్సీ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

నేడు పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం

కురవి, మార్చి19 : కురవి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీరభద్రస్వామి ఆలయానికి ఉప ఆలయంగా ఉన్న శివాలయంలో బుధవారం ఉదయం 11.30 గంటలకు శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వరస్వామికల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఈవో సత్యనారాయణ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

తొర్రూరు రూరల్, మార్చి19 : మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కూచిపుడి జగదీశ్ అన్నారు. తొర్రూరు మండలంలోని మడిపల్లి శివారులో ఉన్న ఆకేరువాగు పరిసర ప్రాంతాల్లో ఇసుక ర్యాంపులు చేసి అక్రమంగా తరలిస్తున్నారు. దీంతో ఎస్సై జగదీష్ మంగళవారం ఆకేరువాగు పరిసరాలను పరిశీలించి ర్యాంపులను తొలగించి, దారిలో ట్రెంచ్‌లు (గుంతలు) తీయించారు. అనంతరం అయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సై వెంట కానిస్టేబుల్ రాజు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పాలకుర్తి అభివృద్ధి


కాంగ్రెస్‌లో చేరిన వారితో ఝాన్సీరెడ్డి

తొర్రూరు, మార్చి19: పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని రాయపర్తి మండల మాజీ సర్పంచ్ మహ్మద్ ఉస్మాన్‌తో పాటు 100 మంది కార్యకర్తలు డివిజన్ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఝాన్సీరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్నిగ్రామాలను అభివృద్ధి చేసేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని వాటిని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నాయకులు హఠామ్యానాయక్, నిరంజన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, మల్యాల నర్సింహులు, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన


మంగలికాలనీ తాగునీటి బావి వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

మహబూబాబాద్ టౌన్, మార్చి19 : జిల్లా కేంద్రంలోని మంగలికాలనీ వద్ద తాగునీటి బావినుంచి కుళాయిల ద్వారా అపరిశుభ్రమైన నీరు వస్తుందని మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కాలనీ మహిళలు మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా వారానికి ఒకసారి నీరు వస్తుందన్నారు. గతంలో కాలనీవాసుల కోసం తవ్విన బావిలో నీళ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బావి పక్కనే శ్మశాన వాటిక ఉందని, ఆ ప్రాంతంలోని కొంతమంది బావిలో నిమ్మకాయలు, కొబ్బరికాయలు, చెత్తవేయడం వల్లనీరు అపరిశుభ్రంగా మారిందని వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మంగలి కాలనీ వద్ద బావిని శుభ్రపరిచి కాలనీ వాసులకు తాగునీరందించాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు రేష్మ, సుజాత, కవిత, అశ్విని, ప్రవంతి, స్వాతి, సరోజ, అరుణ, అచ్చి, ఫాతిమా, పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి

- కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు, మార్చి 19 : పట్టణంలో గత 10 రోజులుగా వివిధ వార్డుల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భగీరథ పైప్‌లైన్ ద్వారా పాలేరు రిజర్వాయర్ నుంచి వచ్చే నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. మంగళవారం మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్ ఆయా వార్డుల్లో పర్యటించి సిబ్బందికి తగు సూచనలు చేపట్టారు. పట్టణంలోని మంచినీటి బావి వద్దకు వెళ్లి పరిశీలించి బావిని శుభ్రపరిచి పైప్‌లైన్‌ల ద్వారా పట్టణ ప్రజలకు తాగునీటిని అందించాలని సూచించారు. రెండు బావుల నుంచి పైప్‌లైన్లు ఏర్పాటు చేసి భగీరథ ట్యాంక్‌లకు సరఫరా చేసి ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఫిల్టర్ బెడ్ వాటర్ రిపోర్టు ల్యాబ్‌కు పంపడం జరిగిందని, ప్రజలు ఈవాటర్‌ను రెండు రోజుల పాటు కాచి చల్లార్చిన తర్వాతే తాగాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృధా చేయవద్దన్నారు. మునిసిపల్ ఏఈ రంజిత్, వాటర్ సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ సూ చించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 వేల నుంచి రూ.10 లక్షలమధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే ఖచ్చితంగా రసీదు ఉండాలని పేర్కొన్నారు. రూ.10 లక్షలపైన లావాదేవీలు ఉంటే ఆదాయపన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. జిల్లాలో ఏటీఎంలలో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీవ్యాన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఏజెన్సీలు పెద్దమొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈవో నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. లాకర్స్‌లో గోల్డ్‌ను పర్యవేక్షించి క్యాష్ జనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్‌ను ఉపయో గించాలని, వెహికిల్ నెంబర్లను తనిఖీ చేయాలన్నారు. ప్రతీరోజు క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్, ఎన్నికల విధులు, వివిధ శాఖల ప్రాముఖ్యత, తదితర అంశాలపై అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అదనపు కలెక్టర్‌లు ఎం.డేవిడ్, లెనిన్‌వత్సల్ టొప్పో, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఎల్‌డీఆర్‌ఎం సత్యనారాయణమూర్తి, ఎలక్షన్ సూపరిండెంట్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

'వానాకాలం లక్ష్యాలను పూర్తి చేయాలి'

2023-24 వానాకాలం లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సంబంధిత అధికారులతో వానాకాలం లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 వానాకాలం సీజన్‌లో 56,775 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి అయిందని, ఫలితంగా సీఎంఆర్ రావాల్సిన బియ్యం 38,390 మెట్రిక్ టన్నుల లక్ష్యం వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో బాయిల్డ్, రారైస్ మిల్లర్లు వారి కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, పౌరసరఫరాలఅధికారి రాజేందర్, సివిల్‌సప్లై డీఎం కృష్ణవేణి, డీటీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గూడూరు, మార్చి19 : మండలంలోని గుండెంగలో అక్రమంగా తరలిస్తున్న 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకుని, రవాణాకు ఉపయోగించిన గూడ్స్‌ను సీజ్ చేసినట్లు సీఐ బాబురావు, ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు. మంగళవారం వారు తెలిపిన వివరాల ప్రకారం. గుండెంగ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లికి గుగులోతు బాలు అనేవ్యక్తి గూడ్స్‌ద్వారా 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. బియ్యంతో పాటు గూడ్స్‌ను స్వాధీనం చేసుకుని గూడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. బాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై వివరించారు.

మెసెంజర్లను క్రమబద్ధీకరణ చేయాలి


ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మెసెంజర్ల సంఘం రాష్ట్ర బాధ్యుడు భిక్షపతి

కేసముద్రం, మార్చి 19 : మండల విద్యావనరుల కేంద్రాల్లో పనిచేస్తున్న మెసెంజర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి మెసెంజర్ల సంఘం రాష్ట్ర బాధ్యుడు బానోత్ భిక్షపతి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ 20 ఏళ్లుగా చాలీచాలని జీతంతో తాము పనిచేస్తున్నామని, తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

బెల్లయ్యనాయక్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

మహబూబాబాద్ టౌన్, మార్చి 19 : హైదరాబాద్‌లో గిరిజన సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా నియామకమైన తేజావత్ బెల్లయ్యనాయక్‌ను మంగళవారం మానుకోట జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. గిరిజన సహకార అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బెల్లయ్యనాయక్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించిశుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ అర్బన్ అధ్యక్షుడు లింగాల వీరభద్రం,ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు తేజావత్ శంకర్‌నాయక్, ధరావత్ నారాయణ, గుగులోతు నరేష్, కిసాన్ సెల్ జిల్లా నాయకులు కొత్త యుగేందర్‌రెడ్డి, కళ్లెం మధూసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

'సంస్కృత వర్సిటీ ఏర్పాటు చేయాలి'

మరిపెడ రూరల్, మార్చి 19 : సంస్కృత యూనివర్సిటీని ఏర్పాటు చేయాలంటూ సంస్కృతం (పీహెచ్‌డీ) అధ్యాపకుడు లింగ్యానాయక్ ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని హైదరాబాద్‌లో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంస్కృత పోస్టులు మంజూరు చేయాలని, అంతేకాకుండా ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని విన్నవించగా, దానికి నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వ్యాధులపట్ల అవగాహన కల్పించాలి

నెహ్రూసెంటర్, మార్చి19 : ప్రజలు వివిధ రోగాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు వైద్య సిబ్బందికి సూచించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీలో మంగళవారం పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అర్బన్ పీహెచ్‌సీ పరిధిలో ఉన్నటువంటి ఐదు సబ్‌సెంటర్లలో వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు ఆయా రోగాలబారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. బీపీ, షుగర్, షుగర్‌వ్యాధి, క్యాన్సర్ సంబంధిత వ్యాధులకు ఉచితంగా మందులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలోవొబిలిశెట్టి రామకృష్ణ, రత్నకుమారి, పుష్పలీల, కిరణ్మయి, రమ్య, దీపిక, నితిన్, విజయకుమారి, సుమలత, పద్మావతి, లలిత, రజిని, నాగలక్ష్మి, సరిత, జ్యోతి పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్లను పరిశీలించిన రూరల్ సీఐ

కురవి, మార్చి 19 : కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలలో పోలింగ్ స్టేషన్‌లను రూరల్ సీఐ సర్వయ్య మంగళవారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు పోలింగ్‌స్టేషన్‌లలోనిమౌళిక సదుపాయాలను పరిశీలించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకోసం పోలింగ్‌స్టేషన్లలో దివ్యాంగులకు, వృద్ధులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు తనిఖీ

మరిపెడ, మార్చి 19 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మరిపెడలోని రాజీవ్‌గాంధీ సెంటర్లో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును సోమవారం రాత్రి తొర్రూరు డీఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ వాహనం క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పంపించాలని ఆయా అధికారులకు సూచించారు. ఆర్డీవో నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, ఎస్సై తహెర్ ఉన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీ నూతన అధ్యక్షుడిగా బాలునాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి19 : జిల్లా కేంద్రంలోని హౌజింగ్‌బోర్డు కమిటీ అధ్యక్షుడిగా జి.బాలునాయక్ ఎన్నికయ్యారు. యాళ్ల సత్తిరెడ్డి స్మారక హౌసింగ్‌బోర్డు కాలనీ కమ్యూనిటీ హాల్లో సదరు కాలనీ కమిటీని సమావేశం మంగళవారం నిర్వహించారు. సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదిస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా వాకిటి నర్సిరెడ్డి, కోశాధికారిగా సింగం లింగయ్య, ఉపాధ్యక్షులుగా కాలసాని బుచ్చిరెడ్డి, బి.వీరస్వామి, ప్రచార కార్యదర్శిగా బానోత్ శ్రీనివాస్‌నాయక్, సహాయ కార్య దర్శులుగా బానోత్ వీరునాయక్, బాసాని శ్రీనివాస్, జి.వీరునాయక్, బి.అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. కె.కరుణాకర్‌రెడ్డి, ఎం.రంగారెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.వీరారెడ్డి, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కట్ల వెంకన్న, మోహన్‌రెడ్డి, యాదగిరి, మల్లారెడ్డి, జైపాల్‌రెడ్డి, ఆర్.వెంకట్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతోనే ఆరోగ్యం'

తొర్రూరు, మార్చి19 : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారంతోనే చిన్నపిల్లలు, గర్భిణీలు ఆరోగ్యంగా ఉంటారని తొర్రూరు సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శోభ అన్నారు. మంగళవారం తొర్రూరులోని వివిధ సెంటర్‌లలో పోషణ పక్వాడ్ వారోత్సవాలను నిర్వహించారు. చిరుధాన్యాల ఉపయోగం, వాటి ప్రాధాన్యత, అంగన్‌వాడీకేంద్రాల్లో అందించే పాలు, గుడ్లు, పౌష్టికాహారం, తదితర వాటితో చిన్నపిల్లలు, గర్భిణీలు తీసుకుని ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. టీచర్ పద్మ, ఆయా, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.